సాక్షి
పల్నాడు
శుక్రవారం । 12 । జనవరి । 2024




నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విశాఖపట్నం మురళీనగర్‌కు చెందిన భోగావరపు హరి జగదీష్‌కుమార్ కుటుంబం గురువారం రూ. లక్ష అందజేసింది.



అంధుల క్రికెట్ కెప్టెన్‌కు సన్మానం

మొగల్రాజపురం: అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ ఇల్లూరి అజయ్‌కుమార్‌రెడ్డిని కోస్టల్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ బి.వేణుగోపాల్‌రెడ్డి విజయవాడ కార్యాలయంలో గురువారం సత్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటిమట్టం గురువారం 522.60 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,088, జలవిద్యుత్ కేంద్రానికి 26,852, ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

జెడ్పీ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్‌గా జయపాల్



గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్‌గా వేముల జయపాల్ నియమితులయ్యారు. జెడ్పీ పరిధిలో న్యాయస్థానాల్లో వివిధ దశల్లో ఉన్న కేసులను వాదించేందుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, అడ్వకేట్ ప్యానెల్ ప్రతిపాదించిన న్యాయవాదులలో ఒకరైన వేముల జయపాల్‌ను స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్‌గా నియమిస్తూ జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా గురువారం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో ఉత్తర్వులు అందజేశారు.

పలువురు ఎస్‌ఐలకు స్థాన చలనం


నరసరావుపేట: జిల్లాలో పలువురు ఎస్‌ఐలకు స్థానచలనం కల్పిస్తూ జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న కేవీ నారాయణరెడ్డిని రెంటచింతల పోలీసుస్టేషన్, అక్కడున్న జె.శామ్యూల్ రెవీవ్ కుమార్‌ను డీఎస్‌బీకి బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న డీవీ కొండారెడ్డిని నాగార్జునసాగర్ పోలీసుస్టేషన్‌కు, అక్కడున్న పి.అనీల్‌కుమార్‌రెడ్డిని డీఎస్‌బీకి, పిడుగురాళ్ల పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్.కోటయ్యను దుర్గి పోలీసుస్టేషన్‌కు, అక్కడున్న ఎస్ఐ ఎం.శివను డీసీఆర్‌బీకి బదిలీ చేశారు.

అండర్-17 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాలుర క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రికెట్ జట్టును గురువారం పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు ప్రకటించారు. స్థానిక డీఎస్ఏ స్టేడియంలో ఈనెల 6 నుంచి 8 వరకు అంతర్ జిల్లాల పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన క్రీడాకారుల్ని సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. ఎంపికైన వారిలో ఎన్.విష్ణు సాయి, ఏ.ఎస్.కుశాయప్ప, జి.వి.ఎస్.సాకేత్ (వైఎస్సార్ కడప), ఏ.దేవాషిష్, ఏ.రోహిత్ (విశాఖ), జి.దేవప్రమోద్, షేక్ నాగూర్ అబ్దుల్ జబార్, వి.పి.శ్రీనివాసరెడ్డి, షేక్ ఎన్.హుస్సేన్ షరీఫ్ (గుంటూరు), ఎన్.సాయి చరణ్, సి.ఉత్తేజ్, ఎస్.ఎల్.యు.కె.వై.సిద్ధు (చిత్తూరు), షేక్ సమీరుద్దీన్ (పశ్చిమగోదావరి), పి.ఎన్.కశ్యప్ (తూర్పుగోదావరి), టి.శంకరరెడ్డి (కర్నూలు), పి.హమేష్‌రామ్ (నెల్లూరు) ఉన్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 15 నుంచి 22 వరకు బిహార్ రాష్ట్రం పాట్నాలో జరగనున్న 67వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాలుర క్రికెట్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

యార్డులో 73,654 బస్తాల మిర్చి



కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 71,313 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 73,654 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 22,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,000 నుంచి రూ.18,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,000 నుంచి 20,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 39,496 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

ఎలక్షన్... అటెన్షన్

- పల్నాడులో రానున్న సార్వత్రిక ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు
- పోలీసు శాఖతో సమన్వయం
- జిల్లాలో 1926 పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన
- అవసరానికి మించి 20 శాతం అదనంగా ఈవీఎంలు
- పక్కాగా ఓటరు జాబితా తయారీ
- ఇప్పటివరకు 1,08,507 కొత్త ఓట్లు నమోదు
- ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు
- పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి వెల్లడి



సాక్షి, నరసరావుపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్ని ప్రశాంత వాతావరణంలో, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో తీసుకుంటున్న చర్యల్ని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించారు. గత ఎన్నికల్లో గుంటూరు జిల్లాలో 86 శాతం పోలింగ్ నమోదైందని, ఈసారి దాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఓటర్లు చైతన్యంతో విలువైన ఓటును తప్పక వినియోగించుకోవాలని కోరారు. ఎక్కడా హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా, రీపోలింగ్ అవసరం లేకుండా పోలీస్‌శాఖతో సమన్వయం చేసుకుని పని చేస్తామని తెలిపారు. జిల్లాలో 1926 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటిలో అవసరమైన ఫర్నీచర్, లైట్స్, ర్యాంప్, మరుగుదొడ్లు, తాగు నీటి వసతులు ఏర్పాటు చేశామన్నారు.

ఈ ఏడాది నుంచి హోమ్ ఓటింగ్

రానున్న ఎన్నికల నుంచి హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని కొత్తగా కల్పించనున్నామని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా విభిన్న ప్రతిభావంతులు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటి నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునే సదుపాయం ఉంటుందన్నారు. దీన్ని కర్నాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో విజయవంతంగా అమలు చేశారని తెలిపారు.


- జిల్లాలో 34,770 మంది విభిన్నప్రతిభావంతులు ఉన్నట్టు డీఆర్‌డీఏ శాఖ ద్వారా తెలుస్తుండగా, అందులో ఓటర్ నమోదులో 26,895 మంది మాత్రమే ఉన్నారని వివరించారు. మిగిలిన వారు కూడా నమోదు పూర్తి చేస్తే హోమ్ ఓటింగ్‌కు అర్హత పొందుతారని చెప్పారు.
- జిల్లాలో 80 ఏళ్లు నిండిన వృద్ధులు 25,590 మంది, 100 ఏళ్లు నిండిన వారు 110 మంది ఉన్నట్టు తెలిపారు.
- జిల్లాలో 1926 పోలింగ్ కేంద్రాలకు గాను 1926 ఈవీఎంల అవసరం కాగా మరో 20 శాతం యంత్రాలు అదనంగా అందుబాటులో ఉంచాల్సి ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 5,562 బ్యాలెట్ యూనిట్లు, 4,923 కంట్రోల్‌యూనిట్లు, 5,838 వీవీపాట్స్ అందుబాటులో ఉండటంతో ఈవీఎంలు సంతృప్తకరస్థాయి కన్నా అదనంగా ఉన్నాయని వివరించారు. మీడియా సమావేశంలో కలెక్టర్‌తోపాటు జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం పాల్గొన్నారు.

22న తుది ఓటరు జాబితా ప్రకటన

- ఈ నెల 22న తుది ఓటర్ జాబితాను ప్రకటించనున్నామని, అందుకు అవసరమైన చర్యలు నిబంధనల మేరకు తీసుకుంటున్నామని కలెక్టర్ శివశంకర్ తెలిపారు.
- ఇప్పటివరకు జిల్లాలో కొత్తగా ఓటు నమోదుకు ఫారం-6 దరఖాస్తులు 1,38,226 రాగా అందులో 1,08,507 మందికి కొత్తగా ఓటు హక్కు కల్పించామని చెప్పారు.
- ఓటు తొలగింపునకు ఫారం-7 దరఖాస్తులు 1,32,857 రాగా అందులో 1,01,370 ఓట్లను తొలగించామని పేర్కొన్నారు.
- ఇందులో చనిపోయిన వారు 60,515మంది, వలసవెళ్లిన వారు 29,078 మంది, రెండు ఓట్లు ఉన్నవారు 11,777 మంది ఉన్నట్టు తెలిపారు.
- జిల్లాలో 2024 జనాభా అంచనాల ప్రకారం 23,26,664 మంది ఉండగా అందులో జనవరి 1వతేదీనాటికి 17,09,011 మంది ఓటర్లు ఉన్నట్టు పేర్కొన్నారు.
- తుది జాబితా ఈ నెల 22వ తేదీ ప్రకటించినప్పటికీ కొత్త ఓటర్ల నమోదుకు, మార్పులకు నామినేషన్ చివరి రోజు వరకు అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

జిల్లాలో నియోజకవర్గాలుగా ఓటర్ల సంఖ్య

అసెంబ్లీ స్థానం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
పెదకూరపాడు	1,11,989	1,16,839	19	2,28,847
చిలకలూరిపేట	1,07427	1,16,891	49	2,24,367
నరసరావుపేట	1,11,689	1,17,656	29	2,29,374
సత్తెనపల్లి	1,17,072	1,21,907	14	2,38,993
వినుకొండ	1,29,538	1,30,773	22	2,60,333
గురజాల	1,32,049	1,39,037	42	2,71,128
మాచర్ల	1,27,245	1.32,073	22	2,59,340
మొత్తం	8,37,009	8,75,176	197	17,12,382



జిల్లాలో కోడి పందేలు, జూదాలు నిషేధం

ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



నరసరావుపేట: సంక్రాంతి సందర్భంగా జిల్లాలో కోడి పందేలు, గుండాట, జూదాన్ని నిషేధించినట్లు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి హెచ్చరించారు. ఆడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. పోలీసుల ఆజ్ఞలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ శాఖలతో ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గతంలో కోడి పందెలు నిర్వహించిన, ఆడిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. పండుగను సుహృద్భావ వాతావరణంలో, మన సంస్కృతి, సంప్రదాయాల్ని ప్రపంచానికి తెలియజేసే విధంగా జరుపుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎన్నికల్లో తాయిలాలపై జీఎస్టీ నిఘా

- సమన్వయంతో జీఎస్టీ, పోలీస్ శాఖ విధుల నిర్వహణ
- పరస్పర సమాచారంతో తనిఖీలకు సర్వం సిద్ధం
- గుంటూరు రేంజ్ ఐజీ, జిల్లా ఎస్పీని కలిసిన జీఎస్టీ కమిషనర్ బృందం



ఐజీ పాలరాజుకి పుష్పగుచ్ఛం అందిస్తున్న గుంటూరు జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

నగరంపాలెం: ఎన్నికల్లో వివిధ పార్టీల అభ్యర్థులు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు బహుమతుల రూపేణా పంపిణీ చేసే వివిధ రకాల వస్తువుల నియంత్రణపై జీఎస్టీ అధికారులు మరింత నిఘా పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘం సెంట్రల్ జీఎస్టీ అధికారుల్ని ఆదేశించింది. కొద్ది రోజుల కిందట విజయవాడలో జరిగిన ఓ సమావేశంలో ఏపీలోని విశాఖ, గుంటూరు, తిరుపతి, జీఎస్టీ కమిషనర్లకు ఈ విషయాన్ని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. దీనిలో భాగంగా జీఎస్టీ సెంట్రల్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి గురువారం గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్‌ను వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించారు. గుంటూరు జీఎస్టీ కమిషనరేట్ పరిధిలో గుంటూరు, ప్రకాశం, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలు విస్తరించి ఉన్నాయని ఐజీ, ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. బహుమతుల పేరిట పంపిణీ చేసే వస్తువులే కాకుండా, పన్ను చెల్లించని అక్రమ వస్తువులు సైతం ఎన్నికల వేళ గోదాముల నుంచి బయటకు తీసుకొచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఆయా వస్తువుల్ని స్వాధీనం చేసుకునే క్రమంలో జీఎస్టీ అధికారులు, సిబ్బందికి తోడుగా కొంత మంది పోలీస్ సిబ్బందిని కేటాయించాలని కోరారు. ఈ విషయంలో ఐజీ, ఎస్పీలు సానుకూలంగా స్పందించినట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికల వేళ జీఎస్టీ, పోలీస్ శాఖలు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, పరస్పర సహకారం, సమాచార చేరవేతతో తనిఖీలు చేపట్టే దిశగా ముందుకెళ్లాలని నిర్ణయించారు. ఐజీ, ఎస్పీని కలిసిన వారిలో జీఎస్టీ అదనపు కమిషనర్ జి.రామకృష్ణరాజుయాదవ్, నిఘా విభాగం అధికారులు గాదె శ్రీనివాసరెడ్డి, మూర్తి, కాకర్ల శ్రీనివాస్ ఉన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి టౌన్: తెనాలి మార్కెట్‌లో గురువారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠధర రూ.2500 గరిష్ఠధర రూ.3600 , మోడల్‌ధర రూ.3000 వరకు పలికింది.

జిల్లాలో పింఛన్ల పంపిణీ 99.14శాతం

డీఆర్డీఏ పీడీ బాలూనాయక్

నరసరావుపేట: జిల్లాలోని 28 మండలాలు, పురపాలక సంఘాల్లో 99.14శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు డీఆర్డీఏ పీడీ బాలూనాయక్ వెల్లడించారు. గురువారంతో పంపిణీ సమయం ముగిసిందని పేర్కొన్నారు. నూతనంగా మంజూరైన పింఛన్లతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రూ.3వేలు అందజేశామని తెలిపారు. విజయవంతంగా పూర్తిచేసిన సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లకు పీడీ నాయక్ అభినందనలు తెలిపారు.

పంపిణీ ఇలా...

- జిల్లాలో 2,84,947మందిలో 2,82,485మందికి రూ.84.36కోట్లు అందజేత .
- అత్యధికంగా వెల్దుర్తి మండలంలో 99.49శాతం, అత్యల్పంగా ఈపూరులో 98.69శాతం పంపిణీ
- జిల్లా కేంద్రమైన నరసరావుపేట పురపాలక సంఘంలో 11,444మందిలో 11,355మందికి (99.22శాతం) అందించారు.
- చిలకలూరిపేట మున్సిపాలిటీలో 11,440మందికి గానూ 11,352మందికి, సత్తెనపల్లి మున్సిపాలిటీలో 6448మందికి గాను 6391మందికి పంపిణీ
- మాచర్ల మున్సిపాలిటీలో 6626మందిలో 6568మందికి, వినుకొండ మున్సిపాలిటీలో 5580మందిలో 5519మందికి ఇచ్చారు.
- పిడుగురాళ్ల మున్సిపాలిటీలో 6,894మందిలో 6,843మందికి అందించారు.

వాస్తవ పరిస్థితులకు ప్రతిబింబాలు నాటికలు

- కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు
- అనంతవరంలో పోటీలు ప్రారంభం

యద్దనపూడి: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలతో పాటు వాస్తవ పరిస్థితులను కళ్లకు కట్టినట్టు చూపించే ప్రతిబింబాలే నాటికలని ఒంగోలు ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు అన్నారు. మండలంలోని అనంతవరంలో ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ద్వితీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు గురువారం ప్రారంభించారు. తొలుత సినీనటుడు యల్రా రఘుబాబు నటరాజ పూజ నిర్వహించారు. నాటకరంగ పరిశోధకుడు మన్నె శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు పోటీల్ని ప్రారంభించారు. హరిబాబు మాట్లాడుతూ నాటికల్లోని పాత్రల్లో ప్రేక్షకులు తమను తాము చూసుకోవటం ద్వారా సామాజిక చైతన్యం పెరుగుతుందన్నారు. కళాకారులు తమ ప్రదర్శనలతో వీక్షకులను కట్టిపడేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మద్దినేని జయరామకృష్ణ, పోపూరి హనుమంతురావు, శివ సుబ్బారావు, కొరిటాల వంశీకృష్ణ, పెదవల్లి వెంకటేశ్వర్లు, ఆచంట సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రేక్షకులను అలరించిన నాటికలు..

ద్వేషం మనిషికైనా, దేశానికైనా ప్రమాదమనే సారాంశంతో శార్వాణి ఫైన్ ఆర్ట్స్ బోరువంక వారి ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'కొత్త పరిమళం' నాటిక ఆకట్టుకుంది. గంగోత్రి పెదకాకాని వారు ప్రదర్శించిన 'ఆస్తికలు' అనే నాటికలో ఆస్తులు సమకూర్చుకోవటం, డబ్బులు పోగేసుకోవటం సమస్త జీవజాలంలో మనిషికొక్కడికి మాత్రమే ఉన్న విపరీత లక్షణమని ఇది ప్రకృతి విరుద్ధమని చాటి చెప్పిన నాటిక ఆద్యంతం ప్రేక్షకులను ఆలోచింపజేసింది.

'జగనన్న తోడు' వచ్చే..ఆనందం తెచ్చే !

- వరుసగా ఎనిమిదో సారి సాయాన్ని విడుదల చేసిన ప్రభుత్వం
- లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేసిన కలెక్టర్ శివశంకర్
- సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచన
- జిల్లాలో 16,229మందికి రూ.17.17కోట్లు అందజేత
- 22,755 మందికి రూ.54.22 లక్షల వడ్డీ జమ




జగనన్న తోడు చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం రాష్ట్రవ్యాప్తంగా జగనన్న తోడు ఎనిమిదో విడత రుణాలు, వడ్డీ నగదు జమచేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి లబ్ధిదారులు, అధికారులతో కలసి కలెక్టర్ వర్చ్యువల్ విధానంలో వీక్షించారు. అనంతరం జగనన్న తోడు లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సాయంతో చేస్తున్న వ్యాపారం..ఆదాయం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబం ఆర్థికాభివృద్ధి గురించి వాకబు చేశారు. ఎనిమిదో విడత రుణాలకు సంబంధించి రూ.17.17కోట్లు, వడ్డీ రాయితీకి సంబంధించి రూ.54.72లక్షల చెక్కులను కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం శ్రీనిధి డైరెక్టర్ అనూషాతో కలసి శ్రీనిధి రీ-పేమెంట్ పేటీఎం మిషన్లను సంబంధిత సిబ్బందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, డీడీవో మహాలక్ష్మి పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా రుణ మంజూరు ఇలా...

నియోజకవర్గం	లబ్ధిదారులు	మొత్తం
చిలకలూరిపేట	2,256	రూ.2.58 కోట్లు
గురజాల	2,530	రూ.2.75 కోట్లు
మాచర్ల	2,476	రూ.2.60 కోట్లు
నరసరావుపేట	2,285	రూ.2.28కోట్లు,
పెదకూరపాడు	1,949	రూ.1.94కోట్లు
సత్తెనపల్లిలో	2,260	రూ.2.49కోట్లు
వినుకొండ	2,473	రూ.2.50కోట్లు


వ్యాపారం అభివృద్ధి చేస్తా..



జగనన్న తోడు ద్వారా వచ్చే రూ.10వేలతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకున్నా. ఇప్పుడు అందిన మరికొంత రుణంతో మరింత పెంచుకుంటా. సాయాన్ని అందజేసిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

–చింతపల్లి శిరీష, నకరికల్లు

జగనన్నకు కృతజ్ఞతలు



నా భర్త చనిపోయాడు. చిన్న పిల్లలతో ఒంటరి మహిళగా దిక్కుతోచని పరిస్థితుల్లో ఉంటే వలంటీరు ద్వారా జగనన్న తోడుకు దరఖాస్తు చేశా. వచ్చిన రూ.10వేలతో కూరగాయల వ్యాపారం మొదలు పెట్టా. పిల్లలకు అమ్మఒడి అందుతోంది. సాయాన్ని అందిస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు.

–వై.కోటేశ్వరమ్మ, చిలకలూరిపేట



గుంటూరు రైల్వే స్టేషన్‌లో టికెట్ కౌంటర్ వద్ద రద్దీ



కిటకిటలాడుతున్న గుంటూరు బస్టాండు



బస్టాండ్‌కు వెళుతున్న యువతీయువకులు

సొంతూరుకు చలో..చలో

అమ్మానాన్నల ఆప్యాయత.. తోబుట్టువుల మమకారం... స్నేహితుల అనుబంధం మధ్య సంక్రాంతి పండుగను జరుపుకోవడం చక్కని అనుభూతి. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో అదొక మధుర స్మృతి. పట్టణ జీవితంలో విసుగెత్తిన జీవితాలకు సంక్రాంతి పండుగ ఆటవిడుపు. పండక్కి రెక్కలు కట్టుకుని వాలాలని ప్రతి ఒక్కరూ ఉవ్విళ్లూరుతారు. పండగకు స్వగ్రామాలకు తరలివెళ్లే వారితో బస్టాండ్, రైల్వేస్టేషన్ కిటకిటలాడుతున్నాయి. యువకులు, విద్యార్థులు, ఉద్యోగస్తులతో రద్దీగా కనిపిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

సెమీస్‌కు చేరిన రాష్ట్ర హ్యాండ్‌బాల్ జట్టు

విజయవాడ స్పోర్ట్స్: రాజస్థాన్‌లో జరుగుతున్న జాతీయ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు వరుస విజయాలతో సత్తా చాటుతోంది. ఈ నెల తొమ్మిదో తేదీన జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో ఒడిశా జట్టుపై 22–13 తేడాతో, పదో తేదీన రెండో లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ జట్టుపై 32–26 తేడాతో గెలిచి పూల్ విన్నర్‌గా ప్రీ క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టింది. గురువారం ఉదయం జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో జార్ఖండ్ జట్టుపై 30–18 తేడాతో గెలిచి క్వార్టర్స్‌కు చేరింది. సాయంత్రం హోరాహోరీగా జరిగిన క్వార్టర్స్‌లోనూ ఛండీగఢ్ జట్టును 39–38 ఓడించి సెమీస్‌కు చేరింది. నేడు జరిగే సెమీ ఫైనల్‌లో హరియాణా జట్టుతో రాష్ట్ర జట్టు తలపడనుంది. వరుస విజయాలతో దూసుకుపోతున్న జట్టు బృందాన్ని ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పి.సత్యనారాయణరాజు అభినందించారు.

క్లుప్తంగా

బిర్యానీ హోటళ్లు, బేకరీల్లో తనిఖీలు



నరసరావుపేట: స్థానిక పల్నాడు రోడ్డు, అరండల్‌పేటలోని బిర్యానీ హోటళ్లు, బేకరీలపై ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలలో ఫుడ్ కలర్స్, టెస్టింగ్ సాల్ట్ వాడుతున్నారని, అవి ఆరోగ్యానికి హానికరమన్నారు. వాడిన వారిపై కేసులు రాయటం జరుగుతుందని హెచ్చరించారు. లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శంకర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ కాటాలు వాడేవారు తప్పనిసరిగా ప్రతి ఏడాది స్టాంపింగ్ చేయించుకోవాలని, లేనిపక్షంలో జరిమానా కట్టాల్సి వస్తుందన్నారు. జిల్లా విజిలెన్సు కమిటీ సభ్యుడు పిల్లి యజ్ఞనారాయణ, మండల విజిలెన్సు కమిటీ సభ్యుడు షేక్ షాముల్లా పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో మహిళలది కీలకపాత్ర

డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయాన్ని మహిళా సంఘాల ద్వారా రైతుల్లోకి తీసుకువెళ్లేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు ప్రకృతి వ్యవసాయం డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. నరసరావుపేట మండల సమాఖ్య కార్యాలయంలో గురవారం ప్రకృతి వ్యవసాయంపై సమావేశం నిర్వహించారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అనూష అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీపీఎం అమలకుమారి, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్‌లు సమావేశంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ మహిళలు సహకారం అందించడం వలన ప్రకృతి వ్యవసాయం ముందుకు వెళ్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎస్ విత్తనాలు తయారీ విధానంలో మహిళా సంఘాల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఆవుల కొనుగోలు, యూపీఎం షాపు నిర్వాహణ మహిళా సంఘాల ద్వారా నిర్వహిస్తామన్నారు. బాలు నాయక్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తులను జగనన్న మహిళా మార్ట్‌ల ద్వారా రైతులకు అందిస్తామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

సంబరాలకు రంగం సిద్ధం!

ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రంగవల్లుల పోటీలకు ఏర్పాట్లు

- నేడు నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు
- పోటీలకు హాజరు కానున్న 25 మంది మహిళలు
- ప్రథమస్థానంలో నిలిచే మహిళకు రూ. 2 లక్షలు నగదు బహుమతి
- నేడు మండల, నియోజకవర్గ స్థాయి పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం
- ఏర్పాట్లు పర్యవేక్షించిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సంబరాలు జరగనున్న ప్రదేశంలో జరుగుతున్న ఏర్పాట్లు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

సత్తెనపల్లి: సంక్రాంతి సంబరాలకు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో రంగం సిద్ధమైంది. పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటేలా ఫ్లడ్‌లైట్ల వెలుతురులో శుక్రవారం నిర్వహించనున్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కొనసాగిస్తూ మహిళలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో గత ఆరు సంవత్సరాల నుంచి మహిళలకు గ్రామ పంచాయతీ/మున్సిపల్ వార్డు స్థాయి, మండల స్థాయి, మున్సిపాలిటీ స్థాయి, నియోజకవర్గస్థాయిలో వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు మూడంచెల విధానంలో నిర్వహిస్తున్నారు. ఏటేటా విశేష స్పందన ..

2018-19 లో 2,980 మంది 2019-20 లో 5,200 మంది, 2020-21లో 7,300 మంది, 2021-22లో 7,498 మంది 2022-23లో 9,440 మంది, 2023-24 లో 12,916 మంది మహిళలు ముగ్గుల పోటీల్లో భాగస్వాములయ్యారు. ఈ పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానానికి రూ. 2లక్షలు, ద్వితీయ స్థానానికి రూ.లక్ష, తృతీయ స్థానానికి రూ.50 వేలు, చతుర్థ స్థానానికి రూ.25 వేలు, ఐదవ స్థానానికి కన్సోలేషన్ బహుమతి అందిస్తున్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.25 వేలు, ద్వితీయ స్థానానికి రూ.15 వేలు, తృతీయ స్థానానికి రూ.10 వేలు, చతుర్థ స్థానానికి రూ.5 వేలు, 5వ స్థానానికి కన్సోలేషన్, గ్రామ/వార్డు స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.3 వేలు, ద్వితీయ స్థానానికి రూ.2 వేలు, తృతీయ స్థానానికి రూ.1000, చతుర్ధ స్థానానికి రూ. 500, 5వ స్థానానికి కన్సోలేషన్ బహుమతి అందిస్తున్నారు.

ఏర్పాట్లు పర్యవేక్షించిన మంత్రి అంబటి...

సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని జన సందోహం పెద్ద ఎత్తున హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అంబటి రాంబాబు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నియోజకవర్గస్థాయి వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసే ప్రదేశాన్ని, సభ నిర్వహించే సభా స్థలి ఏర్పాట్లు, హాజరయ్యే జనం కూర్చోవడానికి ఏర్పాటు చేసిన గ్యాలరీ ప్రదేశాలు, సంబరాలకు హాజరయ్యే ప్రజలకు అక్కడికక్కడే ఘుమఘుమలాడే వంటకాల వడ్డింపు, తదితర వాటిపై దిశానిర్దేశం చేశారు. పలు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి సూచనలు చేశారు. ఎక్కడా ఎలాంటి లోపం జరగ కూడదని పార్టీ శ్రేణులను ఆదేశించారు. అంతేకాక జనం పెద్దఎత్తున హాజరు కానుండడం, అందులోనూ మహిళలు ఎక్కువ మంది హాజరవుతున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. సంక్రాంతి సంబరాలకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక, యువజన అభివృద్ధి శాఖ మంత్రి ఆర్కే రోజా, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, పలువురు శాసనసభ్యులు హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహసంతి, నాయకులు పక్కాల సూరిబాబు, బాసు లింగారెడ్డి, చల్లంచర్ల సాంబశివ రావు, పెండెం బాబురావు, షేక్ నాగుర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, షేక్ మౌలాలి, రాయపాటి పురుషోత్త మరావు, కళ్లం విజయభాస్కరరెడ్డి, అచ్యుత శివప్రసాద్, మర్రి సుబ్బారెడ్డి స్థానిక నాయకులు ఉన్నారు.

లక్కీడిప్‌లో డైమండ్ నెక్లెస్, ఖరీదైన కార్లు..

కేవలం విజేతలకు మాత్రమే కాకుండా పోటీల్లో భాగస్వాములైన ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతిని ఇంటింటికీ చేరుస్తున్నారు. వీటితో పాటు సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రజలను ఆనంద పరిచేందుకు ఏర్పాటు చేసిన డీప్‌లో అదృష్టవంతులైన విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్నారు. దీనిలో భాగంగా మొదటి బహుమతిగా రూ. 16 లక్షలు విలువ చేసే డైమండ్ నెక్లెస్, రెండో బహుమతిగా రెండు షిఫ్ట్ కార్లు, మూడో బహుమతిగా మహీంద్రా 575 మూడు ట్రాక్టర్లు, నాలుగో బహుమతిగా నాలుగు బుల్లెట్లు, ఐదవ బహుమతిగా 6 షైన్ ద్విచక్ర వాహనాలు, ఆరో బహుమతిగా 10 ఫ్రిజ్‌లు, ఏడవ బహుమతిగా 13 ఎల్ఈడీ టీవీలు, ఎనిమిదవ బహుమతిగా 75 మిక్సీలు పంపిణీ చేయనున్నారు.

అంకితభావంతో 'బజరంగ్' ప్రజాసేవ

నారాకోడూరులో 1234 మందికి వైద్య పరీక్షలు

చేబ్రోలు: ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చిన ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. ప్రజల కలలను, ఆశలను, తన ఆశయాలుగా స్వీకరించి రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమమైన మ్యానిఫెస్టో రూపొందించడమే కాకుండా నూటికి నూరు శాతం అమలు చేయడం ప్రశంసనీయమన్నారు. చేబ్రోలు మండలంలోని నారాకోడూరు గ్రామంలో గురువారం బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేసిన నేత్రజ్యోతి కంటి పరీక్షలు, గుండె పరీక్షలు, ఫిజియో థెరపీ సేవలను 1234 మంది వినియోగించుకున్నారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి వీరిలో 32 మందికి యాంజియోగ్రామ్ సూచించారు. ఈ సందర్భంగా బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలనలో పేదల ఇంటి ముందుకే సంక్షేమ ఫలాలను అందిస్తూ ఇది ఒక పవిత్రమైన కార్యంగా ముందుకు సాగుతున్న క్రమంలో ఇదే ఆదర్శంగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్ అంకితభావంతో ప్రజా సేవను కొనసాగిస్తున్నామన్నారు. గత సంవత్సర కాలంగా బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో కంటి సమస్యల నివారణకై నేత్రజ్యోతి ద్వారా ఉచిత నేత్ర వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఏడు పనిదినాల్లో కళ్ళజోళ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే మీ గుండె పదిలం కార్యక్రమం ద్వారా ఉచిత గుండె పరీక్షలు అవసరమైన వారికి యాంజీయోగ్రామ్ నిర్వహించి సమస్య ఉన్న వారికి స్టంట్స్, బైపాస్ సర్జరీలు చేయించడం జరుగుతుందని, దివ్యాంగ దర్శిని కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు ట్రై సైకిళ్ళు, జైపూర్ కాళ్ళు, వెస్ట్రన్ కమోడ్‌లు అందజేయడం జరుగుతుందని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ తెలిపారు. వృద్ధులను, మహిళలను, వికలాంగులను వైద్య శిబిరానికి ప్రత్యేక వాహనాల ద్వారా తీసుకువచ్చి పరీక్షలు నిర్వహించి అదే వాహనంలో ఇంటికి తీసుకు వెళ్ళడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



నారాకోడూరులో జరిగిన వైద్య శిబిరంలో గ్రామస్తులతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

చట్టాలు, పథకాలపై అవగాహన పెంచుకోండి

కార్మికశాఖాధికారి ఎం. మాధవి



గృహ కార్మికులకు అవగాహన కల్పిస్తున్న మాధవి

గుంటూరు ఎడ్యుకేషన్: గృహ కార్మికులు చట్టాలతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలని కార్మిక శాఖాధికారి ఎం. మాధవి పేర్కొన్నారు. మల్లిఖార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనోవికాస్ కేంద్రంలో గురువారం ఎంఎస్ఐ, అంధేరీ హెల్ప్ సంస్థల ఆధ్వర్యంలో గృహ కార్మిక మహిళలకు చట్టాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రతి గృహ కార్మికురాలికి ఆత్మగౌరవంతో జీవించే హక్కు ఉందని, పని ప్రదేశంలో రక్షణ, భద్రత, నివాసం ఉండే హక్కుతో పాటు చట్ట ప్రకారం కనీస వేతనం పొందే హక్కు ఉందని వివరించారు. అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ-శ్రమ్ పోర్టల్, భవన నిర్మాణ కార్మికులు కార్మికశాఖ వద్ద నమోదు కావాలని సూచించారు. ఈ-శ్రమ్, కార్మికశాఖ గుర్తింపు కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షే పథకాల ద్వారా లబ్ధి పొందవచ్చునని వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్ఐ సమన్వయకర్త సిస్టర్ వ్యాకుల మేరీ, సిస్టర్ ఐడా పాల్గొన్నారు.

చెక్కుల బౌన్స్ కేసులో వ్యక్తికి రెండేళ్లు జైలు శిక్ష

సత్తెనపల్లి: చెక్కు బౌన్స్ కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.8 లక్షలు నగదు చెల్లించాల్సిందిగా రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ మహమ్మద్ గౌస్ గురువారం తీర్పు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి... గుంటూరుకు చెందిన రావి చంద్రయ్య 2015, 2016లో అమరావతి మండలం మద్దూరుకు చెందిన పాదిలి ఆంజనేయులు వద్ద రూ.8 లక్షలు అప్పుగా తీసుకొని నాలుగు ప్రామిసరీ నోట్లు, రెండు చెక్కులు ఇచ్చాడు. చెక్కులు బ్యాంకులో వేయగా ఖాతాలో సరిపడా నగదు లేకపోవడంతో బౌన్స్ అయ్యాయి. దీంతో పాదిల ఆంజనేయులు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. విచారణ సమయంలో పాదిల అంజనేయులు మృతి చెందడంతో ఆయన భార్య పాదిలి అంజనాదేవి, పిల్లలు కేసు కొనసాగించారు. రెండు చెక్ బౌన్స్‌లు నేరం రుజువు కావడంతో రావి చంద్రయ్యకు రెండు చెక్కులకు సంబంధించి ఒక్కో ఏడాది చొప్పున రెండేళ్ల శిక్ష, ఒక చెక్కుకు రూ.4 లక్షల చొప్పున రూ.8 లక్షలు నగదు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు న్యాయవాది బీఎల్ చిన్నయ్య తెలిపారు.

పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరుగుతున్న ఉద్యోగ నియామక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని, మెరిట్ ప్రాతిపదికన రోస్టర్ పద్ధతిలో నియామకాలు చేస్తున్నామని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, ప్రలోభాలకు గురికావద్దన్నారు. ఉద్యోగ నియామక ప్రక్రియలో ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా డీఎంహెచ్ఓను సంప్రదించాలన్నారు.

రాకేష్‌కు సాహిత్య పురస్కారం



రాష్ట్ర సాహిత్య అకాడమీ ప్రతినిధుల నుంచి పురస్కారం అందుకున్న గుండాల రాకేష్

నరసరావుపేట ఈస్ట్: పట్టణానికి చెందిన సాహితీవేత్త గుండాల రాకేష్‌ను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సాహితీ పురస్కారంతో ఘనంగా సత్కరించింది. ఏలూరులోని వై.ఎం.హెచ్.ఎ హాల్‌లో గురువారం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, ఏలూరు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సాహిత్య సంక్రాంతి సంబరాలలో తెలుగు సాహిత్య వికాసానికి, పరిరక్షణకు రాకేష్ చేసిన సేవలకు గుర్తింపుగా రూ.5వేలు నగదు, షీల్డ్, ప్రశంసాపత్రంతో సత్కరించారు. సంబరాలలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసి పురస్కారాలు అందచేశారనీ, పల్నాడుజిల్లా నుంచి తనకు అరుదైన గౌరవం దక్కినట్టు రాకేష్ తెలిపారు. అకాడమీ ఛైర్‌పర్సన్ పిల్లంగొల్ల శ్రీలక్ష్మీ, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల కాళీకృష్ణ, ఏలూరు డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొని పురస్కారం అందించినట్టు రాకేష్ తెలిపారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

నరసరావుపేట: జిల్లాలోని 15 మండలాల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి గురువారం పేర్కొన్నారు. అమరావతి మండలంలోని అమరావతి గ్రామ సచివాలయం, అచ్చంపేట మండలంలోని మాదినపాడు గ్రామ సచివాలయం, బొల్లాపల్లి మండలం పెరూరిపాడు ఎంపీయూపీ స్కూలు, చిలకలూరిపేట రూరల్ మండలంలోని యడవల్లి సచివాలయంలో శిబిరాలు జరుగుతాయన్నారు. అలాగే దాచేపల్లి మండలం భట్రుపాలెం సచివాలయం, దుర్గి మండలం కోలగట్ల ఎంపీయూపీ స్కూలు, యడ్లపాడు మండలంలోని తర్లుపాడు గ్రామపంచాయతీ కార్యాలయం, ఈపూరు మండలం బొమ్మరాజుపల్లి సచివాలయం, కారెంపూడి మండలం మిర్యాల గ్రామంలోని ఎంపీయూపీ స్కూలు, క్రోసూరు మండలంలోని దొడ్లేరు గ్రామ సచివాలయం, ముప్పాళ్ల మండలం తొండపి ఎంపీపీ స్కూలు, నాదెండ్ల మండలం సంకురాత్రిపాడు ఎంపీఈఎస్ స్కూలు ఆవరణలో జరుగుతాయన్నారు. అలాగే నకరికల్లు మండలం కండ్లగుంట గ్రామ హెల్తెకేర్ సెంటర్, పిడుగురాళ్ల రూరల్ మండలంలోని గుత్తికొండలో, శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామ ఆరోగ్య కేంద్రంలో శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. సమీప ప్రాంతాలకు చెందిన ప్రజలు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

22న కోటి ఒక్క లింగాల శివాలయం ప్రారంభం

– స్వామి జ్ఞాన ప్రసన్న గిరి

గుంటూరు వెస్ట్: సమాజ అభివృద్ధి, శాంతి కోసం మహాయజ్ఞాన్ని తలపెట్టామని, ఇందులో భాగంగానే కోటి ఒక్క లింగాల శివాలయ ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు స్వామి జ్ఞానప్రసన్న గిరి తెలిపారు. శుక్రవారం స్థానిక అరండల్‌పేటలోని ఓ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన అయోధ్యలోని రామ మందిర ముహూర్తానికే ఫిరంగిపురం మండలం, వేమవరం గ్రామంలో ఈ దేవాలయాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. సుమారు 8 ఎకరాల విస్తీర్ణంలో 101 అడుగుల మహా శివలింగంతోపాటు 50 అడుగుల మహానందీశ్వరుడు, కోటి ఒక్క లింగాలతో దేవాలయ నిర్మాణం చివరి దశలో ఉందన్నారు. త్వరలో ప్రారంభిస్తున్న ఈ దేవాలయంలో హుండీగాని, అభిషేకం టిక్కెట్లు, వీఐపీ కల్చర్ ఉండవన్నారు. ఒక్క రూపాయి కూడా ఎవ్వరికీ ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఆధ్యాత్మిక పవిత్రతతో భక్తులు దర్శనం చేసుకుంటారని చెప్పారు. ఈ దేవాలయానికి అనుబంధంగా భవిష్యత్‌లో ఎన్నో సేవలు స్థానికులతోపాటు అందరికీ అందుబాటులోకి తేవాలనే సంకల్పంతో ఉన్నామన్నారు. ఎందరో పుణ్యాత్ములు ఈ మహా క్రతువులో భాగస్వామ్యులయ్యారని అందుకే ఇంతటి మహాకార్యాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోపాటు మంత్రులు, శాసన సభ్యులు, ప్రముఖులను ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించామన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ రావాలని స్వామి జ్ఞానప్రసన్న గిరి కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



తాడేపల్లిరూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం మనమంతా కృషి చేయాలని అంబేడ్కర్ మనుమడు డా. భీమ్‌రావు యశ్వంత్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ ఆవిర్భావ సభను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ యశ్వంత్ అంబేడ్కర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 217వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాజగృహ నిర్వాహకులు దుంగా రత్నప్రదీప్, ప్రభుత్వ రిపబ్లిక్ అండ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.